ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు కృతజ్ఞతలు

జీడిమెట్ల, మార్చి 13: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని దయానంద్‌నగర్ పోయే రోడ్డు నూతనంగా వేసినందుకు అధికారులకు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందకు, స్థానిక కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేశ్‌రెడ్డిలకు జై శ్రీరామ్‌నగర్ బస్తీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ కాలనీకి నూతనంగా రోడ్డు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. గత నాలుగేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డును బస్తీ వాసుల ఐక్యతతో సాధించుకున్నామని తెలిపారు. ముందు ముందు కాలనీలో సమస్యలు పరిష్కరించుకోవడానికి కాలనీవాసులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో దయానందనగర్, సంతోష్‌నగర్, రావులస్వామినగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని జడ్సీకి కార్పొరేటర్ల వినతి

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13: కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు వినతిపత్రం అందజేశారు. కాలనీలో బస్తీలో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని, వర్షపు నీటి కాలువలు బాగు చేయాలని, పార్కులు, శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని, విద్యుత్‌వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పలు ప్రజా సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆయా సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చొరవ చూపాలని కోరారు. కార్పొరేటర్లు సూచించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని జడ్సీ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, సబీహ బేగం, రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్లు పగడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

మియాపూర్ మార్చి 13: శేర్లింగంపల్లి మండల పరిధిలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి,, రాష్ట్ర నేత గడ్డం నాగార్జున లు కోరారు. గురువారం శేరిలింగంపల్లి మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలలు భిన్నంగా నిర్వహణ కొనసాగిస్తూ అడ్మిషన్ ఫీజు టెస్ట్ ఫీజుల పేరిట లక్షలలో ఫీజులను వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని, కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దుండిగల్, మార్చి13: వేగంగా దూసుకు వచ్చిన వాటర్ ట్యాంకర్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచాహనంపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, వారిలో ఒకరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుద్దెడకు చెందిన నవీన్‌కుమార్ (20), ప్రవీణ్‌కుమార్(20)ఇద్దరు యువకులు గురువారం వ్యక్తిగత పనులపై డ్యూక్ బైక్ మీద దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని మంజు వైన్స్ రోడ్డులో వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు హుటాహుటిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పరారీలో ఉన్న లారీ డ్రైవర్‌ని, లారీని గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

మియాపూర్ మార్చి 13: మియాపూర్ ఆర్టీసీ డిపో 2 ఆధ్వర్యంలో నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం గురువారం తెలిపారు .ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు ఆర్టీసీ మెరుగైన సేవలు నిమిత్తం తమ సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు .మియాపూర్ బాచుపల్లి నిజాంపేట్ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ సేవలపై ప్రయాణికులు తమ సమస్యలను ఈ కార్యక్రమము ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని డిపో మేనేజర్ కోరారు. 9959226420 ఈ సెల్ ఫోన్ నెంబర్కు నిర్ధారిత సమయంలో ఫోన్ చేసి సేవలపై సలహాలు అందించాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు : డీఈ జనప్రియ

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13: వేసవికాలంలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కూకట్‌పల్లి డీఈ జేఎల్ జనప్రియ, ఏడీఈ బి.ప్రసాద్ తెలిపారు. వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే కూకట్‌పల్లి డీఈ 9440813132, ఏడీఈ : 9440813145 లకు సమాచారం అందించాలని కోరారు. అలాగే ఆయా సెక్షన్ల వారీగా కూకట్‌పల్లి ఏఈ: 9440813156, అల్విన్ కాలనీ ఏఈ:94910617618,భాగ్యనగర్‌కాలనీ ఏఈ 94408 13158 లను సంప్రదించాలన్నారు.

ఎఫ్ఓసీ సెంటర్ ఏర్పాటు

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆ సమస్యలను పరిష్కరించే దిశగా ఫ్యూజ్ ఆఫ్ కాల్(ఎఫ్ఓసీ) సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలో అంతరాయం ఏర్పడితే ఎఫ్ఓసీ: 9490610177, భాగ్యనగర్ ఎఫ్ఓసీ 9490610179, అల్విన్ కాలనీ ఎఫ్ఓసీ: 8331041820 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే టోల్ ఫ్రీ నంబర్ 1912/9440 813 132/9440 813145 ఫోన్ నంబర్ల ద్వారా విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆయా కాలనీలు, బస్తీల్లో విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే విద్యుత్ సిబ్బంది అందుబాటులోకి వచ్చి సేవలందిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లబ్ధిదారులకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఫైనల్ కాస్ట్ వడ్డీ భారాన్ని తగ్గించేందుకు చర్యలు



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్, వెంచర్ 2, ఎల్ఐజీ ఫ్లాట్స్ గృహ సముదాయంలో లబ్ధిదారులకు అండగా ఉంటారని, హౌసింగ్ బోర్డ్ అధికారులతో మాట్లాడి ఫైనల్ కాస్ట్, వడ్డీని తగ్గించేందుకు కృషి చేస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు కేపీహెచ్‌బీ కాలనీ 4వ పేజ్ వెంచర్ 2 అల్వాదయ వర్గాల గృహాల అసోసియేషన్ నేతలు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఇటీవల హౌసింగ్ బోర్డ్ అధికారులు ఎల్ ఐసీ ఫ్లాట్స్ లబ్ధిదారులకు ఫైనల్ కాస్ట్, వడ్డీ డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. దీనిపై 2014లోనే కోర్టును ఆశ్రయించామని, మరల అధికారులు ఫైనల్ కాస్ట్ వడ్డీ డబ్బులు కట్టాలని నోటీసులు జారీ చేయడం బాధాకరమని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డ్ అధికారులు ఆలస్యంగా నిర్మాణ పనులు చేసి వారి నిర్లక్ష్యానికి కొనుగోలు చేసిన లబ్ధిదారులపై భారం వేయడం తగదన్నారు. ఎల్ఐజీ ఫ్లాట్స్ ధరను నిర్ణయించిన ధరకు 63% పెంచి కట్టామని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కాలనీ నాలుగో పేజ్‌లో ఎల్ఐజీ గృహాలను పేదలు కొనుగోలు చేయడం జరిగిందని, వారిపై ఫైనల్ కాస్ట్, వడ్డీల పేరుతో అదనపు భారం మోపడం బాధాకరమన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోర్టును ఆశ్రయించినా మరల హౌసింగ్ బోర్డ్ అధికారులు నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. హౌసింగ్ బోర్డ్ ఉన్నతాధికారులు ఈ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యనిర్వాక అధ్యక్షుడు చావా రవి, అధ్యక్షుడు పెద్దిరాజు ప్రధాన కార్యదర్శి సూరిబాబు, సిద్దు, సంతోష్, నిరంజన్ రెడ్డి, పలువురు కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య జరుపుకుంటున్న రవి యాదవ్

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు చెబుతున్న వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ఘనంగా కవిత జన్మదిన వేడుకలు

శేరిలింగంపల్లి, మార్చి 13: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజును పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మియాపూర్‌లో ..

మియాపూర్, మార్చి 13: వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కవిత పుట్టినరోజును పురస్కరించుకొని కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్ ఆర్ ఎస్‌ను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలి

నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ గౌతమ్

నిజాంపేటమున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ గౌతం

దుండిగల్, మార్చి 13: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని వార్డు ఆఫీసర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎల్ ఆర్ఎస్ ప్రక్రియపై ఆరా తీసి, ఫీల్డ్ ఇన్స్పెక్షన్ ఏ విధంగా చేస్తున్నారు. మొబైల్ ఆఫ్ ద్వారా అప్లికేషన్ నంబర్, పేరు, నమోదు వివరాలను పరిశీలించారు.మొబైల్ నంబర్ ద్వారా ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి రుసుం చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ కాపీలను వీలైనంత తొందరగా అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ప్రజల్లో నమ్మకం కలిగి మిగితా వారు కూడా రుసుము చెల్లించడానికి ముందుకొచ్చే అవకాశం ఉందని తెలిపారు. అప్లికేషన్లను క్రమబద్ధంగా మ్యాపింగ్ చే చేయడంతోపాటు ప్రతిఒక్క వార్డు ఆఫీసరు నిర్ణీత వ్యవధిలో నిర్దేశించిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈనెల 31లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తుందని దరఖాస్తుదారులకు వార్డు ఆఫీసర్లు తెలపాలని, ఆ దిశగా మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో ప్రతిరోజు క్రమబద్ధీకరణ దరఖాస్తులపై పురోగతిని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు తెలపాలని సూచించారు. హెల్ప్ డెస్క్‌లో వచ్చే ఫిర్యాదులను సైతం పరిగణలోకి తీసుకొని సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాంకేతిక సమస్యల ద్వారా వచ్చే ఇబ్బందులను అధిగమిస్తూ ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూలు చేసే ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కార్పొరేషన్ పరిధిలో యూనిఫామ్ టాక్స్ పద్ధతిని అమలుపర్చడానికి కృషి చేయాలని, అందుకు గాను తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కంచె నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, బాచుపల్లి తాసిల్దార్ ఫూల్‌సింగ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనలపై ఉచిత శిక్షణ

మాదాపూర్, మార్చి 13: ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అన్నమయ్యపురంలో వేసవి వెన్నెల పేరుతో ఉచిత కీర్తనల శిబిరాన్ని నిర్వహించనున్నారు. మాదాపూర్ లోని అన్నమాచార్య భావనా వాహిని సంస్థ గత 46 ఏండ్లుగా అన్నమయ్య కీర్తనల ప్రచారానికి నిర్విరామంగా కృషి చేస్తూ అనేక మంది విద్యార్థులను కళాకారులుగా తీర్చిదిద్దింది. అన్నమయ్యపురం అధ్యక్షురాలు, పద్మశ్రీ డా.శోభారాజు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అనేక వినూత్న కార్యక్రమాలు చేస్తూ అన్నమాచార్య సంకీర్తనల ప్రచారమే లక్ష్యంగా శోభారాజు అనేక మంది విద్యార్థులకు సంకీర్తనలపై శిక్షణ అందించారు. నేర్చుకోవడం యోగం నేర్పించడమే భోగం అనే నినాదంతో సాగే వేసవి వెన్నెల శిక్షణ కార్యక్రమం ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7:30 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్యపురం నిర్వాహకురాలు, పద్మ శోభారాజు తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా, సంగీత పరిజ్ఞానం లేకుండా, గాత్రం ఎలా ఉన్నా ఎవరైనా కీర్తనలు నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సౌజన్య:9550129946, రాజు రాజేశ్వరి:9441276825, రమణ:9848024042 నంబర్లలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలి



కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న జశ్వంత్ తదితరులు

దుండిగల్, మార్చి 13:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్లోని శ్మశానవాటిక, అంత్యక్రియల సమస్యల పరిష్కారానికి పలువురు బీఆర్ఎస్ నేతలు గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీకి వినతి పత్రం అందజేశారు. కమిషనర్ 10 రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసులో సంబంధిత వ్యక్తుల ఫోన్ నంబర్స్ బోర్డులను ఏర్పాటు చేస్తామని, ప్రగతినగర్ శ్మశానవాటిక సమీపంలో నోటీసు బోర్డులు, అంత్యక్రియల ఛార్జీల గురించి సమాచార బోర్డు, నీటి పనులు, అంత్యక్రియలకు సంబంధించిన సంప్రదింపు ఫోన్ నంబర్ల సమాచారం, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం రసీదు పుస్తకం ప్రగతినగర్ శ్మశానవాటికకు సంబంధించి ఏవైనా ఇతర సమస్యలు ఉంటే వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని మేనేజర్ జయరాజును ఆదేశించారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ 6వ డివిజన్ అధ్యక్షుడు ఉప్పు జస్వంత్, డివిజన్ యూత్ అధ్యక్షుడు సాయికుమార్, ఎలీషా, మణికంఠసాయి, మహేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో వెలసిన నిర్మాణాలు కూల్చివేత

ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

దుండిగల్, మార్చి13: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి మండలం, బాచుపల్లి శ్రీ సాయినగర్‌లోని సర్వే నంబర్ 186 ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గురువారం మండల రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నంబర్స్ 186 ప్రభుత్వ భూమిలో గత కొంతకాలంగా కొందరు అక్రమార్కులు భూములను ఆక్రమించి గదులు నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో స్పందించిన అధికారులు ఎట్టకేలకు గురువారం జేసీబీలతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బాచుపల్లి రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలి



ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్‌కుమార్‌కు సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చర్లపల్లి/కాప్రా, మార్చి 13: ఈసీఐఎల్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్‌కుమార్‌ను, ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలపై చర్చించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో పలు పాఠశాలల అభివృద్ధికి ఈసీఐఎల్ సంస్థ చేసిన కృషిని ప్రస్తావించారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల అభివృద్ధి, కాలనీలో సీసీ కెమెరాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టే విషయంపై చర్చించారు. ఈసీఐఎల్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ ఎంపీ, ఎమ్మెల్యేలకు జ్ఞాపికలను అందజేశారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో తాగునీటి సరఫరా సరిగాలేదు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, మార్చి 13:గ్రేటర్, పరిసర ప్రాంతాల పరిధిలో తాగునీటి సరఫరా సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. శాసన మండలిలో జరిగిన కౌన్సిల్ సమావేశాలలో తాగునీరు తదితర సమస్యలపై మండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్లకు ముందు ఉన్న పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ కనిపిస్తుందని, ఎక్కడ చూసినా మంచినీటి ట్యాంకర్లు, ప్రజలు తాగునీటి కొరకు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తాగునీటి నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గాయత్రి నగర్ అభివృద్ధికి కృషి

నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

అల్లాపూర్, మార్చి 13:గాయత్రి నగర్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామని కార్పొరేటర్ బేగం అన్నారు. నూతనంగా ఏర్పడిన గాయత్రి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి కృష్ణారావు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు గురువారం కార్పొరేటర్ సబిహాబీగంలో వార్డు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందించిన కార్పొరేటర్ కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ కలిసినవారు ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్, కోశాధికారి శ్రీలత, జాయింట్ సెక్రెటరీ విష్ణు, జనరల్ సెక్రెటరీ రమణాచారి, నూతన కార్యవర్గ కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు, లక్ష్మణ్ గుప్తా, జితేందర్,కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

తాగునీరు సరఫరా చేయండి

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాధాకృష్ణనగర్,గణేశ్‌నగర్ కాలనీలో గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ సబియా బేగంను గురువారం వార్డు కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ జలమండలి అధికారితో ఫోన్లో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు కనీస అవసరమైన నీటిని సరఫరా చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని కార్పొరేటర్ హెచ్చరించారు. కార్పొరేటర్ కలిసినవారు గణేశ్‌నగర్ అధ్యక్షుడు పన్నాల రాజశేఖర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, సుందరం శేషారావు, జలేంధర్, దామోదర్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, పూలమ్మ తదితరులు ఉన్నారు. – అల్లాపూర్, మార్చి13

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

మియాపూర్, మార్చి 13: వివేకానందనగర్ డివిజన్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి డివిజన్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతిపత్రం సమర్పించారు.

కారు బీభత్సం

మహిళ తో సహా రెండు వాహనాలను ఢీకొట్టిన డ్రైవర్

కారు నడిపిన వ్యక్తి సోమశేఖర్

దుండిగల్, మార్చి 13: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గురువారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. కారు నడిపే వ్యక్తి అడ్డువచ్చిన పలువురిని ఢీకొట్టడంతోపాటు వేగంగా నడుపుతూ పారిపోతుండటంతో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అయితే వాహనదారుడు మద్యం మత్తులో ఇదంతా జరుగుతుందని పోలీసులు భావించినప్పటికీ నిద్రలో జరిగినట్టు తేలింది. పోలీసులు తెలిపిన ప్రకారం... మేడ్చల్ జిల్లా, గుండ్ల పోచంపల్లిలోని ఉద్దిత టవర్స్‌లోని విల్లా నంబర్.1లో నివాసం ఉంటున్న అంబు రామయ్య కుమారుడు సోమశేఖర్(48) వ్యాపారం నిర్వహిస్తుంటాడు. అయితే సోమశేఖర్ గురువారం రాత్రి కార్‌లో కూకట్‌పల్లి వైపు నుంచి జగద్గిరిగుట్ట బస్టాండ్ మీదుగా పైప్‌లైన్ రోడ్‌లో షాపూర్ నగర్ వైపు వస్తున్నాడు. జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్‌లో ఓ మహిళను ఢీకొట్టిన సోమశేఖర్ అనంతరం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో షాపూర్‌నగర్ మార్కెట్లోకి వెళ్లి అక్కడ మరో వాహనాన్ని ఢీకొట్టి వెళ్తుండగా షాపూర్‌నగర్‌లోని ఉషోదయ చౌరస్తా వద్ద జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ ట్రాఫిక్ సిగ్నల్స్ నిలిపివేసి అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ సోమశేఖర్ నిలుపకపోవడంతో వెంబడించి పట్టుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా.. నెగెటివ్ వచ్చింది. కుటుంబసభ్యులను విచారించగా సోమశేఖర్‌కు తరచూ నిద్ర మాత్రలు మింగే అలవాటుందని అతడి భార్య తెలిపింది. దీంతో నిద్ర మాత్రలు మింగి వాహనం నడపడం వల్లే ఈ ఘటన జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. కాగా ట్రాఫిక్ పోలీసులు సోమశేఖర్‌ను సూరారం పోలీసులకు అప్పగించగా.. వారు జీడిమెట్ల పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తున్నది.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

మియాపూర్, మార్చి 13: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రసాంకేతిక సహాపలు అంశాలపై విద్యార్థులు ఆకట్టుకునే ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ (శ్రీనివాసరావు వైజ